పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రణభేరి..

❖ మూడు పార్టీల ఫోకస్ గ్రాడ్యుయేట్ ఓటర్లపై

❖ కాంగ్రెస్‌లో అభ్యర్థుల కసరత్తు.. బీఆర్ఎస్, బీజేపీ కూడా వ్యూహాల పదును.

దశ, హైదరాబాద్: తెలంగాణలో వచ్చే ఏడాది జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు రాజకీయ వేడి మొదలైంది. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్, భారతీయ జనతా పార్టీ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటూ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ముఖ్యంగా పట్టభద్రుల ఓటర్లను ఆకర్షించేందుకు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించాయి.

అభ్యర్థుల ఎంపికలో పారదర్శకత పాటించాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించింది. ఢిల్లీలో జరిగిన సమావేశంలో ప్రతి ఎమ్మెల్సీ స్థానానికి ముగ్గురు బలమైన అభ్యర్థులతో కూడిన ప్యానెల్‌ను సిద్ధం చేసి సమర్పించాలని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులకు సూచించినట్లు సమాచారం. ప్రస్తుతం వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న తీన్మార్ మల్లన్న, మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల స్థానం నుంచి ఎన్నికైన బీఆర్ఎస్ నేత సురభి వాణీదేవి పదవీకాలం 2027 మార్చి 29తో ముగియనుంది. దీంతో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం మార్చి 2027లోపు ఈ రెండు స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఖాళీ అయిన వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానానికి 2024 ఉప ఎన్నికలో తీన్మార్ మల్లన్న విజయం సాధించారు. మరోవైపు 2021లో హైదరాబాద్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి గెలిచిన సురభి వాణీదేవి పదవీకాలం కూడా అదే సమయంలో ముగియనుండటంతో రెండు స్థానాలకు ఒకేసారి ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు ప్రక్రియ సాధారణ ఎన్నికలతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. ప్రతి ఎన్నికకు కొత్తగా పట్టభద్రుల ఓటర్ల నమోదు చేపట్టాల్సి ఉండటంతో ఈ ప్రక్రియ నోటిఫికేషన్‌కు నాలుగు నుంచి ఐదు నెలల ముందే ప్రారంభమవుతుంది. త్వరలోనే ఓటర్ల నమోదు కార్యక్రమం ప్రారంభం కానుండగా, అభ్యర్థుల ప్రకటన కూడా అదే దశలో జరిగే అవకాశముంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు విద్యావంతులు, ఉద్యోగులు, నిరుద్యోగ యువత రాజకీయ అభిప్రాయాలను ప్రతిబింబించే ఎన్నికలుగా భావిస్తారు. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ విద్య, ఉద్యోగ, యువజన విధానాలపై పట్టభద్రుల తీర్పు ఎలా ఉండబోతుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

ప్రభుత్వ పనితీరును సమర్థించేందుకు కాంగ్రెస్, ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్, బీజేపీలు ఇప్పటికే తమ వ్యూహాలను సిద్ధం చేస్తున్నాయి. ప్రజల్లో మంచి గుర్తింపు, విద్యావంతుల వర్గాల్లో ప్రభావం ఉన్న నాయకులను అభ్యర్థులుగా బరిలోకి దించేందుకు మూడు ప్రధాన పార్టీలు కసరత్తు ప్రారంభించినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

చిన్నంబావి మండలంలో ఎస్ఐఆర్ 89.38% పూర్తి

❖ ఎలక్టర్ ఫారాల డిజిటైజేషన్

❖ క్షేత్రస్థాయి ధృవీకరణ కార్యక్రమాలు వేగవంతం

❖ చిన్నంబావి మండల తహసిల్దార్ శ్రీనివాస్

దశ, చిన్నంబావి : చిన్నంబావి మండలంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది. తాజా గణాంకాల ప్రకారం మండలంలోని మొత్తం 24,724 మంది ఓటర్లలో 22,099 మంది ఎలక్టర్ ఫారాలు డిజిటైజ్ చేయగా, వాటిలో 22,095 ఫారాలను బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ధృవీకరించారు. దీంతో 89.38 శాతం పురోగతి నమోదైంది. మండలంలోని 32 పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తూ, అవసరమైన పత్రాలను పరిశీలించి డిజిటల్ నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. అదే విధంగా డూప్లికేట్ ఎంట్రీలు (డీఎస్ఈ), గైర్హాజరు, మరణించిన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్ల (ఏఎస్‌డీ/యూఈఎఫ్) వివరాలను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా రూపొందించే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ సందర్భంగా తహసీల్దార్, సహాయ ఎన్నికల నమోదు అధికారి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి అర్హత కలిగిన ఓటరిని జాబితాలో చేర్చడంతో పాటు అర్హత లేని నమోదులను తొలగించే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇంకా మిగిలిన ఓటర్లు తమ ఎలక్టర్ ఫారాలను త్వరితగతిన సమర్పించి, బీఎల్ఓలకు అవసరమైన సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), సంబంధిత శాఖల అధికారులు సహకరించాలని కోరారు.

జర్నలిస్టుల సంక్షేమమే టీయూడబ్ల్యూజే ప్రధాన ధ్యేయం

❖ జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా

దశ, రుద్రంగి: జర్నలిస్టుల హక్కుల పరిరక్షణతో పాటు వారి సంక్షేమమే తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూ డబ్ల్యూజె) హెచ్ 143 ప్రధాన లక్ష్యం అని జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా అన్నారు. మంగళవారం ఆయన రుద్రంగి మండల ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన టీయూడబ్ల్యూజే సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని సభ్యులకు సభ్యత్వ రసీదులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్లం నారాయణ, సాగరన్న నాయకత్వంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తోందని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ, రుద్రంగి ప్రెస్ క్లబ్ బాధ్యులు గసికంటి రాజు, ఎల్లాల నర్సారెడ్డి, కత్తి రాజు, గుగ్గిళ్ల తిరుపతి, తుమ్మనపెల్లి నరేందర్, పిసరి కిషన్, నెరేళ్ల శేఖర్, లింగంపల్లి గంగాధర్, దెగావత్ తిరుపతి, నంద్యాడపు శ్రీనివాస్, మండలోజి ఉదయ్, సుంచు అనిల్, తర్రె మునీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

❖ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్ కె. హరిత

దశ, ఆసిఫాబాద్: ఈ నెల 9న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను పకడ్బందీగా నిర్వహించి, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, తొమ్మిది ఆదివాసీ తెగల సంఘాల ప్రతినిధులతో కలిసి నిర్వహించిన సన్నాహక సమావేశంలో కలెక్టర్ వేడుకల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలో జరిగే వేడుకల్లో తొమ్మిది ఆదివాసీ తెగల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల గొప్ప సంస్కృతి,సంప్రదాయాలు, కళారూపాలు ప్రతిఒక్కరికీ చాటిచెప్పేలా కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు తాగునీరు, భోజనం, వైద్య సదుపాయం, పారిశుద్ధ్యం, రవాణా తదితర అన్ని మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖతో పాటు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వేడుకలను విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ, ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఆదివాసీల ఐక్యతకు ప్రతీకగా నిలవాలని, అన్ని ఆదివాసీ సంఘాలు సమిష్టిగా పనిచేసి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమం నిర్వహణకు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీ, ఆదివాసీ నాయకులు సిడాం అర్జు, బుర్స పోచయ్య, కుర్సింగ మోతిరామ్, మడావి నర్సింగ్రావు, చాహకటి దస్రు, కొడప విశ్వేశ్వర్, తొమ్మిది ఆదివాసీ తెగల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండల స్థాయికి 'ప్రజావాణి' విస్తరణ.. తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు

❖ మండల కేంద్రాల్లోనే ప్రజా ఫిర్యాదుల స్వీకరణ.. జీఓ ఎంఎస్ నెం.4 జారీ*

దశ, హైదరాబాద్: ప్రజల సమస్యల పరిష్కారాన్ని మరింత వేగవంతం చేసి గ్రామీణ స్థాయికి చేరువ చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఇప్పటికే రాష్ట్ర, జిల్లా, రెవెన్యూ డివిజన్ స్థాయిలో అమలవుతున్న *ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయికి విస్తరిస్తూ* మంగళవారం *జీఓ ఎంఎస్ నెం.4*ను జారీ చేసింది.

ప్రణాళిక (ప్లానింగ్ V) శాఖ విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో, ప్రజలకు చేరువ చేసే ఉద్దేశంతో మండల స్థాయిలో కూడా ప్రజావాణి నిర్వహించనున్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల కేంద్రాల్లోనే వినతులు సమర్పించే అవకాశం కల్పించనున్నారు.

ఇప్పటికే *2026 మే 4* నుంచి రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి అమలులో ఉంది. దీనికి అనుసంధానంగా ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన *ప్రజావాణి పోర్టల్* ద్వారా రాష్ట్ర, జిల్లా, రెవెన్యూ డివిజన్ స్థాయిలో వచ్చిన ఫిర్యాదులను నమోదు, పరిశీలన, పర్యవేక్షణ, పరిష్కారం చేస్తున్నారు.

తాజా ఉత్తర్వులతో మండల స్థాయిలో స్వీకరించే ఫిర్యాదులను కూడా ఇదే *ఏకీకృత ప్రజావాణి పోర్టల్* ద్వారా నమోదు చేసి, ప్రాసెస్ చేయనున్నారు. దీంతో రాష్ట్రం నుంచి మండల స్థాయి వరకు ఒకే డిజిటల్ వేదికపై ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అమలులోకి రానుంది. ఈ విధానం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారంలో వేగం పెరగడంతో పాటు, సమన్వయం, పారదర్శకత, సమర్థవంతమైన పర్యవేక్షణ మరింత మెరుగుపడుతుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. మండల స్థాయిలో ప్రజావాణి అమలు ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కావడంతో పాటు, ఫిర్యాదుల పరిష్కారం కూడా త్వరితగతిన జరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

బ్లాక్ మనీ పేరుతో రూ.13 లక్షల మోసం

❖ నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

❖ 20 వేల బ్లాక్ పేపర్లు, రసాయనాలు స్వాధీనం

❖ మోసగాళ్ల మాటలు నమ్మొద్దు

❖ పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్

దశ, అశ్వారావుపేట: బ్లాక్ మనీని అసలు కరెన్సీగా మారుస్తామని నమ్మించి రూ.13 లక్షలు మోసం చేసిన నిందితుడిని అశ్వారావుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ అశ్వారావుపేట కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మధుబాబును లక్ష్యంగా చేసుకున్న పత్తిపాటి ప్రేమ్‌చంద్ అనే నిందితుడు, ప్రత్యేక రసాయన ద్రావణంలో బ్లాక్ పేపర్లను ముంచితే అవి రూ. 500 నోట్లుగా మారతాయని నమ్మించాడు. ఈ మాయమాటలతో మొదట రూ.11 లక్షలు, అనంతరం రసాయనాలు కొనుగోలు చేయాలనే పేరుతో మరో రూ.2 లక్షలు తీసుకుని మొత్తం రూ.13 లక్షలు కాజేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ. 500 నోట్ల పరిమాణంలో కట్ చేసిన 20 వేల బ్లాక్ పేపర్లు (20 కట్టలు), వాటిని నోట్లుగా మారుస్తామని నమ్మించేందుకు ఉపయోగించే రెండు రసాయన ద్రావణాల సీసాలను స్వాధీనం చేసుకున్నారు.విచారణలో నిందితుడిపై గతంలో బాచుపల్లి, రామచంద్రాపురం, కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో నకిలీ కరెన్సీ, మోటార్‌సైకిళ్ల దొంగతనాలకు సంబంధించిన కేసులు నమోదైనట్లు, జైలుకు కూడా వెళ్లి వచ్చినట్లు వెల్లడైందని డీఎస్పీ తెలిపారు.తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని, బ్లాక్ మనీని అసలు నోట్లుగా మారుస్తామని చెప్పే మోసగాళ్ల మాటలను నమ్మవద్దని, ఎవరైనా అనుమానాస్పదంగా వ్యవహరిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ ప్రజలకు సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో అశ్వారావుపేట సీఐ నాగరాజు, ఎస్‌హెచ్‌ఓ యయాతి రాజు,ఎస్సై దేవ్ సింగ్ పాల్గొన్నారు.

అద్దె భవనాల్లోనే ప్రభుత్వ పాలన

❖ తహసీల్దార్ కార్యాలయనికి సొంత భవనాలు లేవు

❖ ప్రజల ఇబ్బందులు పట్టించుకునే వారు ఎవరూ లేరా

దశ, చిన్నంబావి : చిన్నంబావి మండలం ఏర్పడి ఎన్నో సంవత్సరాలు గడిచినా, ప్రభుత్వ పరిపాలనలో కీలకమైన తహసీల్దార్ కార్యాలయం సహా పలు ప్రభుత్వ కార్యాలయాలు ఇప్పటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. శాశ్వత భవనాల నిర్మాణం జరగకపోవడంతో ప్రజలు, ఉద్యోగులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ రైతులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు వివిధ ధ్రువపత్రాలు, రెవెన్యూ సేవలు, ఇతర ప్రభుత్వ అవసరాల కోసం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్నారు. అయితే అద్దె భవనాల్లో సరిపడా స్థలం లేకపోవడం, తాగునీరు, మరుగుదొడ్లు, వేచిచూడటానికి అనువైన సౌకర్యాలు వంటి కనీస మౌలిక వసతులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఉద్యోగులు కూడా పరిమిత వసతుల మధ్యే విధులు నిర్వహించాల్సి వస్తోంది.ప్రతి నెలా కార్యాలయాల అద్దె కోసం ప్రభుత్వ ఖజానా నుంచి లక్షల రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ, శాశ్వత భవనాల నిర్మాణంపై మాత్రం ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే నిధులను ప్రణాళికాబద్ధంగా వినియోగించి సొంత భవనాలు నిర్మిస్తే ప్రభుత్వానికి దీర్ఘకాలంలో ఆర్థిక భారం తగ్గడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. మండల ప్రజల అవసరాలు, ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తహసీల్దార్ కార్యాలయంతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలంటే ముందుగా ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. హామీలు కాదు, సమస్యకు శాశ్వత పరిష్కారమే కావాలని చిన్నంబావి మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.